

మహదేవపూర్ : అనర్హులకు పథకాలు ఇస్తున్నారని అధికారులతో ప్రజల వాగ్వాదం

## గ్రామసభలో కాంగ్రెస్ నేత దౌర్జన్యం

**ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకుడిపై దాడి**

జనగామ రూరల్, జనవరి 22 : జనగామ మండలం వడ్లకొండలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. అధికార పార్టీ నాయకులు గ్రామసభ దద్దరిల్లే రీతిలో లొల్లి పెట్టడంతో గ్రామస్తులు, లబ్ధిదారులు ఆశ్చర్యపోయారు. దీంతో గ్రామంలో అర్హులు ఎవరున్నారు? వారి పేర్లు కాకుండా అనర్హుల పేర్లతో గ్రామసభను నిర్వహించడం ఏంటని బీఆర్ఎస్ నాయకుడు కొలనుపాక నరేశ్ ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నేత కోర్నెపాక విష్ణు 'మీ ప్రభుత్వంలో ప్రజలకు ఏమైనా పథకాలు ఇచ్చారా' అంటూ నరేశ్‌పై దాడికి దిగాడు. అక్కడే ఉన్న గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వారిని సముదాయించారు. పోలీసులు గ్రామస్తులకు నచ్చజెప్పి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు పహారా మధ్య అధికారులు గ్రామసభ నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

## గ్రామ సభలతో ఒరిగేదేం లేదు

- ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ మరోసారి మోసం
- ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న రాష్ట్ర సర్కారు
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 22 : ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మరోసారి మోసం చేస్తున్నదని, రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ సభలతో ఒరిగేదేం లేదని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. బుధవారం మహబూబాబాద్‌లోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చి పాలనలో మార్పు తెస్తామని, అధికారంలోకి వచ్చాక నిరుపేదల సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు. గ్రామ సభల్లో అధికారులు కేవలం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ, రైతు భరోసా పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు చదువుతున్నారని పేర్కొన్నారు.దీని వల్ల అధికారుల సమయం, ప్రజాధనం వృథా అవుతున్నదన్నారు. జాబితాల్లో అనర్హులు ఎక్కువ మంది ఉన్నారని, నిజమైన లబ్ధిదారులను సంక్షేమ పథకాలకు ఎంపిక చేయలేదన్నారు. కాంగ్రెస్ నాయకులను మాత్రమే ఎంపికచేసి నిరుపేదలను విస్మరించారని, అధికారం చేపట్టి పదమూడు నెలలైనా ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన తులం బంగారం, వృద్ధులకు ఆరు వేల పెన్షన్, విద్యార్థినులకు స్కూటీల పంపిణీ, స్కాలర్ షిప్ వంటివి ఇంకా అమలు చేయలేదన్నారు. రేవంత్‌రెడ్డి ఎప్పుడూ బోగస్ మాటలతోనే కాలయాపన చేస్తున్నాడని విమర్శించారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి పేద వాడికి లబ్ధి జరిందన్నారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేదకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తక్కళ్లపల్లి పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ వేణుమాధవ్, రామకృష్ణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : ఇటుకాలపల్లి గ్రామ సభలో పథకాలపై నిలదీస్తున్న మహిళలను సముదాయిస్తున్న అధికారి

# జనాగ్రహం

## రెండో రోజూ గ్రామసభల్లో నిరసనల హోరు

*ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జనాగ్రహం పెల్లుబికింది. రెండో రోజైన బుధవారం నిర్వహించిన గ్రామ సభల్లో నిరసనలు హోరెత్తాయి. రైతుభరోసా, ఇందిరమ్మ, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల జాబితాల్లో తమ పేర్లు ఎటుపోయాయంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులకు ఎలా చోటు కల్పించారంటూ మండిపడ్డారు. ముందే తయారు చేసిన జాబితాలోని పేర్లు చదవడానికి గ్రామ సభలెందుకని ప్రశ్నించారు. మొదటి రోజు ఆందోళనలు అధికమైన నేపథ్యంలో రెండో రోజు భారీ బందోబస్తు మధ్య పోలీసులు కార్యక్రమాలను నిర్వహించారు. పలు చోట్ల కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలా పెద్ద పీట వేస్తారంటూ ఆగ్రహించారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు సంధిస్తూ అధికారులను నిలదీయడంతో పాటు వాగ్వాదం చేస్తున్న మహిళలు, పురుషులను ఖాకీలు అడ్డుకొని అక్కడి నుంచి పంపించివేయడంతో పాటు వీడియోలు తీశారు. పథకాల అమలు నిరంతరం కొనసాగుతుందని, పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారులు సూచించారు. చేసేదేమీ లేక మరోసారి దరఖాస్తులు ఇచ్చి అధికారులను తిట్టుకుంటూ ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా, పలు చోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగి దాడికి పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మొత్తంగా గందరగోళం మధ్యనే గ్రామ సభలు కొనసాగాయి.*

**- నమస్తే నెట్‌వర్క్, జనవరి 22**

- మా పేర్లు ఎటుపోయాయంటూ ప్రజల ఆందోళన
- అనర్హులకు ఎలా చోటిచ్చారంటూ మండిపాటు
- పేర్లు చదవడానికి సభలెందుకని నిలదీత
- పోలీసు బందోబస్తు మధ్య సాగిన కార్యక్రమాలు
- ప్రశ్నించే వారిని అడ్డుకొని వీడియోలు తీసిన ఖాకీలు
- మళ్లీ దరఖాస్తులు సమర్పించిన లబ్ధిదారులు



నల్లబెల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

## కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

- పోలీసు నిర్బంధం మధ్య గ్రామ సభలు సిగ్గుచేటు
- ఎన్నికల స్టంట్ కోసమే యత్నిస్తున్న రాష్ట్ర సర్కారు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, జనవరి 22 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానిది అసమర్థ పాలన అని, పోలీసు నిర్బంధం మధ్య గ్రామ సభలు నిర్వహించడం సిగ్గుచేటని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. గ్రామ సభలు పెద్ద మాయ అని, ఎన్నికల స్టంట్ కోసమే రేవంత్ సర్కారు కుటిలయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. బుధవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అమలు చేసే ముందు గ్రామ సభలు నిర్వహించడం ఆనవాయితీ అని, కానీ గత ప్రభుత్వాలు వీటి కోసం పోలీసు బలగాలను వినియోగించలేదన్నారు. నల్లబెల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన గ్రామ సభను పోలీస్ కమిషనర్ మినహా వరంగల్ జిల్లా పోలీసు యంత్రాంగం మధ్య నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. అంతేగాక గొడవలు సృష్టించేందుకు ముందు రోజే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మండల కేంద్రంలో జరిగే గ్రామ సభకు నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా, రేషన్‌కార్డులు, రుణమాఫీ, ఆత్మీయ భరోసాపై నాయకులు, అధికారులను నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక పోలీసులను మోహరించి ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 400 రోజులు గడిచినా ఎందుకు హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. అంతేగాక తాను మంజూరు చేసిన కోట్లాది రూపాయల పనులను ఎమ్మెల్యే మాధవరెడ్డి రద్దు చేశారన్నారు. అలాగే కేవలం లాభం వచ్చే పనులకు మళ్లీ టెండర్లు పిలిచి ఆయనే సొంతంగా పనులు చేస్తూ ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే రైతులకు రావాల్సిన రూ. 49 కోట్ల బోనస్ మంజూరు చేయాలని, అలాగే కన్నారావుపేట గ్రామంలో తాను మంజూరు చేసిన హార్టికల్చర్ రిసెర్చ్ స్టేషన్ పనులను ప్రారంభించాలన్నారు. ఇక ముందు తన జోలికి వచ్చే పోలీసులపై రాజ్యాంగబద్ధంగా, చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోనని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్‌గౌడ్, ప్యాక్స్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ రావు, మాజీ ఎంపీపీ తదితరులు పాల్గొన్నారు.

### మా బతుకంతా దరఖాస్తులు పెట్టుడేనా?

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వంలో మా బతుకంతా ధరఖాస్తులు పెట్టడానికే సరిపోతున్నది. మేము కాంగ్రెస్ కార్యకర్తలం, నాయకులం కాదు. నిరుపేద కుటుంబానికి చెందిన వాళ్లం. చెరువు కింద మామూలుగా ఇంటి నిర్మాణం ఇప్పుడిప్పుడే చేపట్టాం. గతంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం ధరఖాస్తు పెట్టుకున్నాం. ఏడాది గడిచినా అతీగతీ లేదు. మళ్లీ ఇప్పుడు ధరఖాస్తు చేసుకోవాలన్నరు. రాజకీయ పలుకుబడి ఉన్నోళ్ల పేర్లు లిస్టులో ఉంటానయ్. మాలాంటి పేదల పేర్లు ఎందుకు ఉంటలేవు?

**– ఈరబోయిన రజిత, ఇటుకాలపల్లి, నర్సంపేట**





నల్లబెల్లి : గ్రామ సభలో ప్రశ్నిస్తున్న మాజీ సర్పంచ్ రాజారాంను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలోనే బెదిరిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్‌కుమార్

### కాంగ్రెసోళ్లు తిడుతున్నరు



బతుకుదెరువు కోసం నేను హైదారాబాద్‌కు పోయి పని చేసుకుంటున్న. నాకు ఇల్లు లేదు. పడమటిగూడెంలో గ్రామసభ ఉందని తెలిసి వస్తే జాబితాలో నా పేరు లేదు. ఆత్మీయ భరోసా లేదు. బాగా ఉన్నోళ్ల పేర్లే లిస్టులో రావడంతో అధికారులను అడుగుతుంటే 10 ఏళ్లుగా ఏం చేసినవ్ అంటు అగౌరవంగా కాంగ్రెసోళ్లు తిడుతున్నరు. నాకు న్యాయం చేయాలని అడిగితే అధికారులు సమాధానం చెప్పకుండా వెళ్లిపోయిండ్రు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నేను ఆశ వర్కరుగా పని చేసిన. పైసలు సక్రమంగా రాకపోతే హైదారాబాద్‌కు పోయిన.

*– గూడెల్లి రమ, పడమటిగూడెం, నర్సింహులపేట*



అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న 30వ డివిజన్ కార్పొరేటర్ రావుల కోమలా కిషన్



రఘునాథపల్లి : కోడూరులో అధికారులను నిలదీస్తున్న యువకుడు



రాయపర్తి : కొలన్‌పల్లిలో అధికారులను నిలదీస్తున్న దుర్గయ్యను బయటకు నెట్టివేస్తున్న కానిస్టేబుల్

### ఆడబిడ్డ కంటతడి



బచ్చన్నపేట : మండలంలోని అలీంపూర్ గ్రామానికి చెందిన సిరిపాటి స్వరూప కొన్నాళ్లుగా బచ్చన్నపేటలో ఉంటున్నది. ఇందిరమ్మ ఇళ్లు కోసం దరఖాస్తు పెట్టుకుంది. బుధవారం జరిగిన గ్రామసభ సందర్భంగా జాబితాలో పేరు లేకపోవడంతో అక్కడే కంటతడి పెట్టింది. అర్హులకు ఇండ్లు ఇవ్వాలని, బంగ్లాలున్న వారికి కాదని, తాను అద్దె ఇంట్లో ఉంటున్నా తన పేరు రాలేదంటూ మండిపడింది.



చిన్నగూడూరు : ఖాళీ కుర్చీలకు దరఖాస్తు ఇస్తున్న గ్రామస్తులు



నర్సింహులపేట : పడమటిగూడెం జీపీ కార్యాలయానికి తాళం వేసేందుకు ప్రయత్నిస్తున్న మహిళ




పాలకుర్తి : దర్దేపల్లిలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

## కాజీపేట రైల్వేస్టేషన్‌కు సరికొత్త హంగులు

- రూ.24.45 కోట్లు కేటాయించిన కేంద్రం
- శరవేగంగా అమృత్ భారత్ పనులు

కాజీపేట, జనవరి 22 : ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్రంలోనే రెండో అతి పెద్దది, ఉత్తర, దక్షిణ భారతానికి ముఖద్వారంగా ఉన్న కాజీపేట రైల్వేస్టేషన్ సరికొత్త హంగులు అద్దుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వం అమృత భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్)లో కాజీపేట్ రైల్వేస్టేషన్ ఎంపిక చేసి 2024లోనే రూ.24.45 కోట్లు కేటాయించగా, పనులు శరవేగంగా కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ఏబీఎస్ఎస్ కింద తెలంగాణలో మొత్తం 40 స్టేషన్లు ఎంపికైనట్టు పేర్కొన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్‌ను 1888లో నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే నిర్మాణం చేపట్టింది. ఈ స్టేషన్ సికింద్రాబాద్-ఢిల్లీ రైలు మార్గంలో నిర్మించబడింది. కాజీపేట రైల్వే సబ్ డివిజన్ ప్రాంతంలో బొగ్గు, పత్తి, గ్రానైట్, సిమెంట్ తదితర వస్తువులు అందుబాటులో ఉండడంతో ప్రస్తుతం రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నది. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి నాలుగు రైళ్లు ప్రారంభం అవుతుండడంతో పాటు ప్రతి రోజు దాదాపు వంద ప్రయాణికుల రైళ్లు కాజీపేట- బలార్ష, కాజీపేట-విజయవాడ, కాజీపేట - సికింద్రాబాద్ సెక్షన్‌లో రాకపోకలు సాగిస్తాయి. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.



అమృత్ భారత్ పథకంతో అభివృద్ధి చెందనున్న రైల్వే స్టేషన్ నమూనా

### కాజీపేటలో జరిగే అభివృద్ధి పనులు

- స్టేషన్ ముఖద్వారం అభివృద్ధి
- ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం ఏర్పాటు
- ప్రయాణికుల సౌకర్యార్థం 12 మీటర్ల వెడల్పుతో పాదచారుల వంతెన(ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం, రెండు లిఫ్టులు, 2 ఎస్కలేటర్లు
- ప్లాట్‌ఫారం అభివృద్ధి, అభివృద్ధి పైకప్పు ఏర్పాటు
- మలమూత్రశాలల మెరుగు, దివ్యాంగులకు సౌకర్యాలు, కొత్త టాయిలెట్ల బ్లాకుల నిర్మాణం
- ప్రయాణికుల విశ్రాంతి గదుల ఆధునీకరణ, స్టేషన్‌లో కళలు, సంస్కృతి చిత్రీకరణ
- స్టేషన్ ఆవరణలో పచ్చదనం, ట్రాఫిక్‌కు సజావుగా సాగడానికి స్టేషన్ ప్రాంగణం అభివృద్ధి



రైల్వే స్టేషన్ ముఖద్వారం నమూనా

### ఇట్లాంటి గ్రామ సభను ఎన్నడూ చూడలే..



ఎన్నో ప్రభుత్వాలను చూశాం. ఇట్లాంటి గ్రామ సభలను యాడ చూడలే. గతంలో కష్టం చెప్పుకోవడానికే అప్పటి ప్రభుత్వాలు గ్రామ సభలు పెట్టినయి. ఇప్పుడేమో కట్టెలు, తుపాకులు పెట్టి పోలీసులతో కష్టం చెప్పుకునే వారిని బెదిరిస్తూ బయటకు లాగేస్తున్నరు. గ్రామ సభకు ఇంతమంది పోలీసులు అవసరమా? ఇదేం పాలన. ఇద్దరు కూతుళ్లతో ఇల్లు లేక ఎన్నో ఏండ్లుగా కిరాయికి ఉన్న. ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు రాలే. ఉన్న వాళ్లకు పథకాలు ఇచ్చేందుకేనా ఓట్లేసింది. మళ్లా మా రోజులు వత్తయి.. గప్పుడు చూస్తం అయ్యాగాండ్ల ఆట. **– మహ్మద్ షాహీద్, నల్లబెల్లి**



ఏటూరునాగారం : షాపల్లిలో అధికారులను నిలదీస్తున్న మహిళలు

## ప్రశ్నించిన ప్రజలు.. పరారైన అధికారులు

**తొర్రూరు 6వ వార్డులో ఘటన**

తొర్రూరు, జనవరి 22 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ 6వ వార్డులో నిర్వహజంచిన వార్డు సభ ప్రజాగ్రహానికి వేదికైంది. బుధవారం సభ జరిగే సమయానికి మున్సిపల్ అధికారులు రాకపోవడంతో చాలా సేపటి వరకు ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. కొద్ది సేపటికి అధికారులు సభా వేదికపైకి రాగా, ప్రజలు నిలదీశారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు పథకాల జాబితాల్లో అనర్హులకు చోటు దక్కడంపై మండిపడ్డారు. గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు అక్కడి నుంచి పారిపోయారు.



ప్రజాగ్రహానికి వెళ్లిపోతున్న మున్సిపల్ అధికారులు



తొర్రూరు మున్సిపాలిటీ 6వ వార్డులో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు